ఇండియా కూటమి విజయంతోనే సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర - మల్కాపురం: ఇండియా కూటమిని గెలిపిస్తే సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని పశ్చిమ నియోజకవర్గం ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల పేర్కొన్నారు. సోమవారం గడపగడపకు ప్రచా రంలో భాగంగా 61వ ప్రాంతంలో పర్యటించిన ఆమె రానున్న ఎన్నికల్లో తమ పార్టీ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలకు న్యాయం చేసే పార్టీ తమ పార్టీ అని స్థానిక సమస్యల పరిష్కారంలో అందుబాటులో ఉండి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, సీపీఐ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పశ్చిమంలో సీపీఐ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - విశాఖ : ఇండియా కూటమి కాంగ్రెస్, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన విశాఖ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు మద్దతుగా సోమవారం మల్రిపాలెం, గోపాలపట్నం, బాజీ జంక్షన్, పురుషోత్తపురం, బుచ్చిరాజుపాలెం తదితర ప్రాంతాల్లో కూటమి శ్రేణులు ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహిం చారు. సీపీఐ అభ్యర్థి విమలను గెలిపించాలని, విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ కృషి చేస్తుందని పేర్కొంటూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వ హించారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరించారు. అలాగే ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నేతలు ఎస్కె రెహమాన్, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్, నాగభూషణం, రవి, పుష్ప, దేవుడమ్మ, జె రాజేశ్వరి, వినోద్, కుమారి, తవిటిరాజు, ఎస్కె మున్న, లక్ష్మణరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీ భరత్ నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జై భరత్, జై టీడీపీ అంటూ విశాఖ నగరం సోమవారం మారు మోగింది. విశాఖ పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి శ్రీ భరత్ నామినేషన్ వేయడానికి కలెక్టరేట్‌కు భార్యతో కలిసి వచ్చారు. విశాఖలోని వివిధ నియో జక వర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు కదలి రాగా నామినేషన్ కార్యక్రమం జన జాతరను తల పించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు అభిమానులు భారీగా తరలిరావడంతో నగర వీధులు జనసంద్రాన్ని తలపించాయి. ఎన్‌టిఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నామినేషన్ కార్యక్రమానికి ర్యాలీగా బయలు దేరిన భరత్‌తో భార్య తేజస్విని కుమారుడు ఆర్యవీర్ వెంటవచ్చారు. ఎంవిపి డబుల్ రోడ్‌లోని ఎమ్.వి. కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ రైతు బజార్, ఇసుకతోట, మద్దెలపాలెం, గురుద్వార మీదుగా కలక్టరేట్‌కు చేరుకుంది. నగరంలోని ప్రధాన రహదారులు పసుపు మయం అయిపోయాయి. పసుపు దండుకు జనసేన, బిజెపి అభిమానులు తోడవడంతో కధనోత్సాహంతో ముందుకు కదిలారు. తూర్పు, ఉత్తరం, దక్షిణం నియోజకవర్గాల మీదుగా సాగిన ర్యాలీలో గాజువాక, భీమిలి, ఎస్,కోట నుండి వచ్చిన పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నాయి. రహదారులు జన సంద్రంతో కిక్కిరిసిపోయాయి. శ్రీ భరత్‌తో పాటు భార్య తేజస్విని ముందుగా నిర్ణయించిన ముహూర్త సమయం 11 గంటల 46 నిమషాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణం నియోజకవర్గాల అభ్యర్థులు వెలగ పూడి రామక్రిష్ణబాబు, పి.గణబాబు, వి.విష్ణుకుమార్ రాజు, వంశీక్రిష్ణ శ్రీనివాస యాదవ్, గాజువాక భీమిలి నియోజకవర్గాల అభ్యర్థులు పల్లా శ్రీవివాస్, గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వాడ రామారావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్‌తో పాటు టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, రవీందర్ రెడ్డి, జనసేన మహిళా నేతలు పసుపులేటి ఉషాకిరణ్, ప్రశాంతి పాల్గొన్నారు.

అట్టహాసంగా బొత్స ఝాన్సీ నామినేషన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఏ మల్లికార్జునకు ఆమె తన నామినేషన్లను అందజేశారు. ఝాన్సీ లక్ష్మి నామినేషన్ పత్రాలను విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జామి జెడ్పీటీసీ గొర్ల సరయు ప్రతిపాదించారు. ఝాన్సీ లక్ష్మీ వెంట రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు, ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, జిల్లా వైసీపీ అధ్యక్షులు కోలా గురువులు, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి అవంతి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, గాజువాక మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, రాష్ట్రస్థాయి పలు కార్పొరేషన్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సతీష్ పాల్గొన్నారు. బొత్స సత్యనారాయణ ఝాన్సీ లక్ష్మీ దంపతులు విశాఖపట్నం ఎండాడలో క్యాంపు కార్యాలయంలో ఉన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కుటుంబ సభ్యులతో సహా కలుసుకున్నారు. అనంతరం బీచ్ రోడ్‌లో ఉన్న లాసన్స్ బే కాలనీ వైయస్ఆర్సీపీ ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో ఎమ్మెల్యేలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిమకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నామినేషన్ అనంతరం ఎంపీ అభ్యర్థి ఝాన్సీ లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ తనపై అభిమానంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాయకులంతా నామినేషన్ కార్యక్రమానికి వచ్చినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నామినేషన్ల జోరు.....

విశాఖ పార్లమెంటు స్థానానికి ఐదు నామినేషన్లు...

ఏడు నియోజకవర్గాల్లో 28 నామినేషన్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నామినేషన్లకు గురువారంతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో సోమవారం పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సోమవారం నామినేషన్లు జోరందుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ పార్లమెంటు స్థానానికి ఐదో రోజు సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు విశాఖ పార్లమెంటు ఆర్.వో, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ.మల్లిఖార్జునను కలిసి కార్యాలయంలో ఏడు సెట్ల పత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన, భాజపా కూటమి నుంచి ఉమ్మడి అభ్యర్థులుగా మతుకుమిల్లి శ్రీ భరత్, మతుకుమిల్లి తేజశ్విని ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి కార్యాలయంలో అందించారు. విశాఖ ఎంపీ అభ్యర్థులుగా వైసీపీ నుంచి బొత్స ఝాన్సీలక్ష్మీ మూడు సెట్లు, బొత్స అనూష ఒక సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. అలాగే సమాజ్ వాదీ పార్టీ నుంచి జాలాది విజయ కుమారి సోమవారం మరొకసారి రెండో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ముందుగా ఆయా అభ్యర్థుల పత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి, ఏఆర్వో కె.మోహన్ కుమార్ పరిశీలించి సహకారం అందించారు. వివిధ పార్టీల అభ్యర్థుల నుంచి జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున నామినేషన్ పత్రాలు స్వీకరించి ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 28 నామినేషన్లు దాఖలు అయ్యాయి. గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో సోమవారం ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుంచి 28 నామినేషన్ పత్రాలను స్వీకరించారు. భీమిలి నియోజకవర్గ పరిధిలో బాగం గోపాలరావు బహుజన సమాజ్ పార్టీ నుంచి ఒక సెట్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా మరొక సెట్, స్వతంత్ర అభ్యర్థినిగా నందికోళ్ల సత్య ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి అడ్డాల స్వప్న ఒక సెట్, అడ్డాల వెంకట వర్మరాజు రెండు సెట్లు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. తూర్పు నియోజకవర్గం నుంచి ఐదో రోజు సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. భారత చైతన్య యువజన పార్టీ నుంచి యెద్ల వేణుగోపాల కృష్ణ, స్వతంత్ర అభ్యర్థినిగా ఆదాడ రమణి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను తూర్పు ఆర్.వో., జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ కార్యాలయంలో అందజేశారు. అలాగే టీడీపీ నుంచి వెలగపూడి రామకృష్ణబాబు, వెలగపూడి సుజన సోమవారం మరొకసారి రెండో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. దక్షిణ నియోజకర్గ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులుగా లగిశెట్టి తారకరాం ఒక సెట్, కంబేటి శ్రీదేవి ఒక సెట్, కడగల ఈశ్వరరావు మూడు, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము రెండు సెట్లు సమర్పించారు. ఉత్తరం పరిధిలో బహుజన సమాజ్ పార్టీ నుంచి పెద్దాడ కనకమహాలక్ష్మి రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థినిగా ముమ్మనేని సరోజని, జాతీయ జనసేన పార్టీ నుంచి పి. జగదీశ్, స్వతంత్ర అభ్యర్థినిగా ఎలమంచిలి సాహితి నామినేషన్లు దాఖలు చేశారు. పశ్చిమం నుంచి స్వతంత్ర హనుమంతు శివ చాణక్య దొర నామినేషన్ వేశారు. గాజువాక నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కాండ్రేగుల ఆదినారాయణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి నందికోళ్ల అప్పారావు, సిపిఐ(ఎం) పార్టీ తరపున మరడాన జగ్గునాయుడు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్.ఓకు సమర్పించారు. పెందుర్తి నియోజకర్గం పరిధిలో నేషనలిస్టు జనశక్తి పార్టీ నుంచి ఏలూరు వెంకట రమణ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ నుంచి ఈత రోజా ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్.ఓకు సమర్పించారు.

భరత్ నామినేషన్‌కు మద్దతుగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర - మల్కాపురం: విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ నామినేషన్ సోమవారం వేసిన సందర్భంగా పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డు పరిధి నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు మద్దతుగా భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు, పార్లమెంట్ అభ్యర్థి భరత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని అన్నారు.

బి-ఫామ్ అందుకున్న అవంతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి తోడ్పాటుతో భీమిలి ప్రజలు ఆశీర్వాదాలతో సోమవారం వైవి సుబ్బారెడ్డి చేతులు మీదుగా భీమిలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు బి-ఫామ్ అందుకున్నారు. భీమిలి నియోజకవర్గం ప్రజలు మూడోసారి అవంతికే పట్టం కడతారని ఈ సందర్భంగా సుబ్బారెడ్డి ఆశీర్వాదం తెలియజేశారు. నిరంతరం ప్రజా సమస్యలపైనే భీమిలి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న అవంతి శ్రీనివాసరావును భీమిలి ప్రజలు ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

భీమిలి బీఎస్పీ అభ్యర్థి భాగం గోపాలరావు నామినేషన్

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం బీఎస్పీ అభ్యర్థిగా భాగం గోపాలరావు సోమవారం తన నామినేషన్ వేశారు. ముందుగా తమ నివాసం వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు మహిళలతో కలిసి కిచెన్ పేట, అంబేద్కర్ కాలనీ నుంచి ఊరేగింపుతో వెళ్లి ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా భాగం గోపాలరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సమస్యలపై మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరం పోరాడుతున్నానని, రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. పది సంవత్సరాలుగా అవంతి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు ఎక్కడ నుండో వచ్చి భూ దోపిడీలు చేస్తూ భీమిలి నియోజకవర్గం ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న మనల్ని తరిమి వేస్తారని రాబోయే ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం ప్రజలు ఎప్పుడు అందుబాటులో ఉండే స్థానికుడైన తనను గెలిపించాలని కోరారు.

అట్టహాసంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హాసిని వర్మ నామినేషన్

విశాలాంధ్ర - భీమిలి: భీమిలిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి హాసిని వర్మ నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని హాసిని వర్మకు మద్దతు తెలియజేశారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, మధురవాడ, తదితర ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో హాసిని వర్మ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా హాజరయ్యారు. తీన్ మార్, కోలాటాలతో అట్టహాసంగా తాళ్ళవలస నుండి ఊరేగింపు కన్నుల పండుగగా జరిగింది. ఆర్.డి.ఓ. కార్యాలయంలో హాసిని వర్మ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ అభ్యర్థి సత్యారెడ్డి, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ గాదం మహేష్, స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, డిసిసి అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పెందుర్తి నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి పిరిడి భగత్, సిపిఎం నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వల్ల వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపానికి కారు దగ్ధం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం పెట్రోల్ బంక్ సమీపంలో ప్రధాన రహదారిలో భానుడి ప్రతాపానికి ఏపి 31 టివి 6893 నెంబర్ గల కారు ఆహుతైంది. బయట ఎండ తీవ్రత, ఇంజిన్ వేడికి ప్రయాణికులతో వెళుతున్న సమయంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు ప్రాణ గండం తప్పింది. వాహన చోదకులు, పాదచారులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగానే సత్వరమే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. కారుని మెకానిక్ దుకాణం నుండి ఇంటికి తీసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని కారులో ప్రయాణిస్తున్న వారు తెలిపారు.

పదవ తరగతి ఫలితాల్లో 8వ స్థానంలో విశాఖ జిల్లా

91.15 శాతం ఉత్తీర్ణత ఫలితాలు, బాలికలదే పై చేయి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పదో తరగతి పరీక్షలు మార్చి-2024 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. విశాఖ జిల్లా నుంచి 14932 మంది బాలురు, 13,367 మంది బాలికలు మొత్తము 28,299 మంది హాజరు కాగా, 13,449 మంది బాలురు, 12,345 మంది బాలికలు మొత్తము 25,794 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 91.15 శాతంతో రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. వీరిలో బాలురు ఉత్తీర్ణతా శాతం 90.07, బాలికలు ఉత్తీర్ణతా శాతం 92.35. గత సంవత్సర ఫలితాలతో పోలిస్తే 8.47% పెరుగుదల సాధించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో ప్రథమ శ్రేణిలో 21,998 మంది ఉండగా, ద్వితీయ శ్రేణి లో 2620 మంది, తృతీయ శ్రేణిలో 1176 మంది ఉత్తీర్ణులయ్యారు. శత శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు 137 ఉండగా సున్నా శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు లేకపోవడం విశేషం. ఎస్.ఎస్.సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు తేదీ 24.05.2024 నుండి 03.06.2024 వరకు నిర్వహించబడతాయన్నారు.

ఉత్తీర్ణులు కాని విద్యార్థులు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా 23.04.2024 నుండి 30.04.2024 వరకు పరీక్షఫీజు చెల్లించవచ్చు అన్నారు. రూ 50/- ఆలస్య రుసుంతో తేదీ 23.05.2024 వరకు చెల్లించవచ్చు అన్నారు.

విశాఖ సిటీ: పదో తరగతి పరీక్షల్లో బుచ్చిరాజుపాలెంలోని డీఏవీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వి.చార్మి పట్నాయక్ 594 మార్కులతో స్కూల్ ఫస్ట్ ర్యాంక్, బి.వి.ఎస్.శ్యాం ప్రకాష్ 583 మార్కులతో స్కూల్ 2వ ర్యాంక్, బి.రేశ్వంత్ 581 మార్కులతో స్కూల్ 3వ ర్యాంక్‌లో నిలిచారు. మిగతా విద్యార్థులందరూ కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహదేవ్ శాస్త్రి సంతోషం వ్యక్త పరిచారు. పిల్లలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాభినందనలు తెలిపారు.

జగన్ బస్సుయాత్రకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర - మధురవాడ: జగన్ బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను వివరించి బస్సు యాత్ర చిరస్మరణీయంగా నిలిచిపోయేలా దిగ్విజయం అయ్యేలా భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం మధురవాడ పార్టీ కార్యాలయంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ జగన్ బస్సుయాత్ర మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు మధురవాడ క్రికెట్ స్టేడియం నుండి ప్రారంభమౌతుందని చెప్పారు. ఈ యాత్ర కొమ్మాది, మారికవలస, గంభీరమ్, ఆనందపురం మీదుగా పెద్దిపాలెం చెన్నయ్ కన్వెన్షన్ సెంటర్ వరకూ సాగుతుందని తరువాత విజయనగరంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం రావడం ఖాయమని, ఇక్కడి నుండే జగన్ పరిపాలిస్తారని అన్నారు. 24వ తేదీన తాను నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుల అధ్యక్షులు పోతిన శ్రీనివాస్, బొట్ట అప్పలరాజు, 8వ వార్డు కార్పొరేటర్ గొలగాని అప్పారావు, వైసీపీ మహిళా నాయకులు చేకూరి రజని, నాయకులు, కార్యకర్తలు, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు దొంగల దోపు ఉత్సవం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి స్వామివారి చేతికి ఉండే ఉంగరం ఒకటి అపహరణకు గురైంది. వివరాల్లోకి వెళ్లితే ఈనెల 19న జరిగిన స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం దొంగల దోపు ఉత్సవం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అప్పన్న తన దేవేరులతో మంది మార్బలంతో కలిసి నేటి రాత్రి అటవికి వేటకు బయలుదేరి వెళ్తారు. ఆ సమయంలో నీలుదు (తిరుమంగై ఆళ్వార్) అనే చోరుడు దారి కాచి ఆ మార్గంలో వెళ్లే వారిని దోచుకునే క్రమంలో స్వామివారి బృందాన్ని అటకాయించి నగలను అపహరిస్తాడు. ఈక్రమంలో స్వామివేలికి ఉన్న ఉంగరాన్ని అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించటం జరుగుతుంది. అప్పన్నస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో అంతర్భాగంగా మంగళవారం రాత్రి ఆరాధన అనంతరం మృగయోత్సవం (దొంగలదోపు) వైభవంగా నిర్వహిస్తారు. అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో అలంకరించి అశ్వవాహనం మీద, మరొక పల్లకిలో తిరుమంగై ఆళ్వార్ (నీలుదు)ను ఉంచి సింహగిరి మాడవీధుల మార్గంలో తీసుకువచ్చారు. మార్గ మధ్యలో నీలుడుగా ఆలయ అర్చకులు సీతారామాచార్యులు నటించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవంలో అర్చకులతోపాటు సింహగిరిపై నివసించే పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

గడప గడపకు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు 91వ వార్డు విద్యానగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, నాయుడు క్వార్టర్స్‌లలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామం నుంచి గంటా శ్రీనివాసరావు సమక్షంలో భారీ ఎత్తున టీడీపీలోకి కార్యకర్తలు, నాయకులు చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంటా గెలుపు ఖాయమని ఆయనతోనే అభివృద్ధిని సాధ్య మని పార్టీలో చేరిన సందర్భంగా వారు తెలియజేశారు. పద్మనాభం కో ఆప్షన్ సభ్యుడు వి.అబ్రహం, కె.పద్మకుమార్, ఎస్.వి.పి.డి. ప్రభాకర్, పి.శాంతరాజు, పి.కృపానందం, పి.సంజీవయ్య, పి.ప్రభుదాసు, కె.మోజేష్, ఎస్.పాల్, వై.పి.రాజు, ఎం.అబ్రహం, తలాడ యశ్వంత్, హంస వాసు, బోని యెర్రిబాబు, తలాడ పద్మనాభ స్వామి, కనకాల అప్పలనాయుడు, ఆర్.బంగారప్పుడు, అడుల శ్రీను, తలాడ శ్రీను, ఉట్టొడు, రామ్మోహన్ నాయుడు, గౌరి నాయుడు తదితరులు గంటా సమక్షంలో టిడిపిలో చేరారు.

బీపీ కల్లాలులో కూటమి విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుప్తా ఆధ్వర్యంలో సోమవారం జనసేన, టిడిపి మహాకూటమి ఇంటింటికి ప్రచారం నిర్వహించింది. తమ అమూల్యమైన ఓటు ముద్రను భీమిలి శాసనసభ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, అలాగే పార్లమెంట్ అభ్యర్థి భరత్ కు సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, బంటువల్లి శ్రీనివాసరావు, గండ్రేటి దుర్గా నరసింహనాయుడు, మీసాలశీను, సత్తిబాబు, బంటుపల్లి గోవిందరావు, శంకరరావు, చందక రమణ, చందక శ్రీను, సంతోష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

SOUTH INDIAN Bank

బ్రాంచ్ - విశాఖపట్నం

Email Id – BR0163@SIB.CO.IN

బ్యాంకులో తనఖాపెట్టిన బంగారు ఆభరణాల వేలం

బ్యాంకు నుంచి పొందిన బంగారు రుణాలు చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ ఈ కిందపేర్కొన్న రుణగ్రహీతలకు సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి విక్రయ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణ మొత్తాలను చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైనందున తాకట్టులో ఉన్న బంగారు ఆభరణాలను "ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" & "ఏమి ఉంటే అది ప్రాతిపదిక" & "రికోర్స్ లేని ప్రాతిపదిక" పై దిగువ సంతకందారు ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తున్నట్లు ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. కింద పేర్కొన్న విధంగా రుణగ్రహీత ఎకౌంట్ నంబర్ల కొరకు తేదీ :02-05-2024 మ॥12:00 గం.నుండి మ॥03:00 గం.ల వరకు https://egold.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును.

క్ర. సం.	బంగారు రుణ ఖాతా నం.	పేరు	తనాఖా పెట్టిన తేదీ	తనఖాబంగారం బరువు (మొత్తం బరువు గ్రాముల్లో)	బంగారు రుణం మొత్తం
1	0163653000027053	అరసాడ సరేశ్	03-08-2023	299.2	10,00,000/-
2	0163653000027054	సరగడ కేశవ	03-08-2023	302.4	10,00,000/-

మరింత సమాచారం కొరకు దయచేసి ఆక్షన్‌టైగర్‌ను 6352632523/9023724780 పై సంప్రదించగలరు.

సం/- మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

సాగర తీరాన మేము సిద్ధం సభకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

విశాలాంధ్ర- విశాఖ సిటీ: తూర్పు నియోజకవర్గంలో "మేము సిద్ధం మా బూత్ సిద్ధం" సభ కార్యక్రమం స్థానిక 19వ వార్డ్ పెదజాలరిపేట, సాగరతీరాన వద్ద సోమవారం మత్స్యకార వైసిపి నాయకులు జీవీ రామచంద్రరావు సమక్షములో జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం వి వి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోజు పెద్ద జాలరిపేట సాగర తీరాన వేలాది మందితో ఈ సిద్ధం సభలో ప్రజలు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఇప్పటికీ ప్రాంతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీలు ఆలయాల ఆధునికరణ కళ్యాణ మండపాలు ఆధునికరణ చేశామన్నారు. ఏపీ సీఎం జగనన్న తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన 100 శాతం హామీలు నెరవేర్చి ఈరోజు చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. విద్య వైద్య రంగాలలో ఎన్నో పెను మార్పులు చేసి ఈరోజు రాష్ట్రంలో ఎంతో విద్యాభివృద్ధికి జగనన్న ఎంతో కృషి చేశారన్నారు. ఈ ప్రాంతంలో గడిచిన రోజుల్లో పాదయాత్ర చేసి ఎన్నో సమస్యలు గుర్తించానన్నారు. అదేవిధంగా రానున్న రోజులలో మరల ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న పాలనలో పక్క గృహ కల్పనకు కృషి చేస్తానన్నారు. 58 నెలల్లో ఏపీ ముఖ్యమంత్రి జగనన్న ప్రతి నెల ఒక్కరోజు ఆలస్యం అవ్వకుండా ఇచ్చిన పెన్షన్లు ఈరోజు కేవలం రాజకీయ కుతంత్రాలుతో వాలంటరీవ్యవస్థను ఆపివేసి పెన్షన్ దారులు సమయానికి ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. తద్వారా అర్హులైన పెన్షన్ దారులు,అవ్వ తాతలు వృద్ధులు వికలాంగులు ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. అదేవిధంగా, అమ్మఒడి, డ్వాక్రా మహిళల రుణమాఫీ, వాహనామిత్ర, ఆసరా వంటి పథకాలతో ప్రజలకు ఎంతో సంక్షేమాన్ని అందించారన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 600 పేజీల ఇచ్చిన మేనిఫెస్టో ఇచ్చిన హామీలను మరిచారని ఈ సందర్భంగా టిడిపి పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను స్థానిక ప్రజలకు చూపించి వివరించారు. కుల మత తారతమ్యం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే సాధ్యమన్నారు. మీ పిల్లలు భవిష్యత్తు మీ తలరాత మారాలంటే మరల జగనన్న ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు.

పశ్చిమలో బస్సు యాత్ర
రోడ్ షోతో ఉప్పొంగిన ఉత్సాహం

విశాలాంధ్ర - మర్రిపాలెం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సుయాత్ర రోడ్ షోతో నియోజకవర్గం కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ప్రజలు ఉత్సాహంగా పాల్గొనగా, కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెరిగినట్టయింది. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్‌కి నియోజకవర్గంలో సానుకూల పవనాలు ఇప్పటికే ఉండగా, సీఎం బస్సు యాత్రతో మరింత అనుకూలత పెరిగిందనీ వైసిపి వర్గాలు వ్యాఖ్యానించాయి. ఆదారి ఆనంద్ కుమార్ విశాఖ డైరీ చైర్మన్ గా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, రూ. 265 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన ఆదారి ఆనంద్ కుమార్, సొంత నిధులు ఖర్చు చేసి, అవసరమైన వారికి పెన్షన్ లు, విద్య, వైద్యానికి సంబంధించి సాయం అందించారనీ చెబుతున్నారు. గత రెండున్నరేళ్ల నుంచి నియోజకవర్గంలో రోడ్లు, కాలువలు, తాగునీటి, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణాలు వంటి పనులు చేపట్టారన్నారు. నామినేటెడ్ పదవితోనే చాలా అభివృద్ధి పనులు చేపట్టిన ఆదారి ఆనంద్ కుమార్ ని ఎమ్మెల్యే గా గెలిపిస్తే, ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన తరువాత పశ్చిమలో సానుకూల వాతావరణం పెరిగిందన్నారు. మీతో ఆనంద్ యాప్ ఆదారికి బాగా కలిసొచ్చింది. యాప్ ద్వారా వచ్చిన అనేక సమస్యలు పరిష్కరించి, ప్రజల మన్ననలు పొందారని, ప్రజలు ఆదారి కార్యాలయానికి రాకుండానే, ఇంటి దగ్గర నుంచి సమస్యలను తెలియజేసే అవకాశం కల్పించారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అభ్యర్థన పై చర్యలు తీసుకుంటూ, సమస్య తెలియజేసిన ఫిర్యాదికి, సమస్య పరిష్కారం విషయం తెలిపే విధంగా చర్యలు చేపట్టారన్నారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన రవీంద్ర భారతి విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: పదవ తరగతి ఫలితాల్లో జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ వద్దగల రవీంద్ర భారతి విద్యార్థులు సత్తా చాటారు. 600 మార్కులకు గాను 595, 593 మార్కులు సాధించి ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అలాగే 500 మార్కులు దాటిన వారు 55 మంది ఉన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యం.యస్.మణి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు విద్యార్థులు మాట్లాడుతూ క్రమశిక్షణనే ఆయుధంగా మలచి, నవీన పద్ధతులు, పురాతన విలువలు నానుడితో సుపరిచితమైన రవీంద్ర భారతి విద్యాసంస్థలు అందించిన ప్రోత్సాహం, విలువలతో కూడిన విజ్ఞానం, పాఠ్యప్రణాళికా రచనా విధానం, ఉపాధ్యాయులు అందించిన ప్రేరణ విజయానికి దోహదమయ్యాయి అని పేర్కొన్నారు.

తమ విద్యార్థులు సాధించిన విజయంతో తమకెంతో ఆనందంగా, సంతోషం గా ఉన్నదని భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించడానికి మరింత ఉత్సాహంతో, ఉత్తేజముతో ప్రణాళికా విధానాన్ని రూపొందిస్తామని, ఇంత గొప్ప ఫలితాలు సాధించిన తమ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ,అశీర్వదిస్తున్నట్లు చైర్మన్ మణి తెలిపారు.

సుజాతనగర్ లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్చార్జి ఎన్. వెంకటేష్, సి జీఎం జి.ఆర్.వసంత, జి.ఎం కె.రమ్య, నార్త్ ఆంధ్ర అకడమిక్ కో ఆర్డినేటర్ సుధాలత,పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశాఖ దక్షిణం బీఎస్పీ అభ్యర్థిగా 'కదిరి' నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా నగరానికి చెందిన న్యాయవాది, బీఎస్పీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము నామినేషన్ దాఖలు చేశారు. విశాఖపట్నం టర్నర్ చౌల్ట్రీలోని ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విశాఖ దక్షిణం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం లోని ఎన్నికల అధికారికి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా కదిరి రాము మాట్లాడుతూ, నియోజకవర్గంలో దశాబ్దాలుగా వున్న పలు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపెడతానని పేర్కొన్నారు. సామాన్యుడే శాసనకర్త, పేదలే ప్రజా ప్రతినిధులనే లక్ష్యంగా బహుజన్ సమాజ్ పార్టీ దేశంలో బహుజనుల రాజ్యాధికారానికి కట్టుబడి నాలుగు దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. మార్పు కావాలి, తీర్పు మారాలి బీఎస్పీ రాజ్యాధికారం సాధించాలని పేర్కొన్నారు. ఏనుగు గుర్తుకు ఓటు వేసి కదిరి రామును గెలిపించాలని కోరారు.

నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కదిరి స్వాతి, వాడమొదుల రామచంద్రరావు, వాసుపల్లి ఎల్లాజీ కుమార్, గునాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన నేతలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయితీ నేతలు భీమిలి నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాస్‌రావుని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు యరబాల అనిల్ ప్రసాద్ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం నుంచి గెలిచి తప్పకుండా గంటా శ్రీనివాస్ మంత్రి అయి తీరుతారని తెలిపి రాష్ట్ర ప్రజలు పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబు నాయుడునే ముఖ్యమంత్రి గా చూడాలని కోరుకుంటున్నారని అది నిజం అయి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ నుంచి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కిరణ్ మాట్లాడుతూ రేఖవానిపాలెం పంచాయితీ నుంచి అత్యధిక మెజారిటీ తీసుకు వచ్చేలా ప్రణాళిక రూపొందించుకుని ఉమ్మడిగా పని చేస్తున్నామని తప్పకుండా మెజారిటీ సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ భీమిలి మండల అధ్యక్షులు డి.ఎ.ఎన్ రాజు, రేఖవానిపాలెం పంచాయితీ తెలుగుదేశం నాయకులు మల్లేటి.మహేష్ వర్మ, తామాడ శ్రీను నాయకులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ జిల్లా ఎంపీ అభ్యర్థి భరత్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు.

అవంతికే నా మద్దతు
కేథరిన్ విద్యాసంస్థల అధిపతి అలివర్ రాయ్

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుని సోమవారం మర్యాద పూర్వకంగా కేథరిన్ విద్యా సంస్థలు అధిపతి జనసేన నాయకులు అలివర్ రాయ్ కలిసి తమ మద్దతును తెలియజేశారు. ఇటీవల వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సిపిలో చేరిన సందర్భంగా సోమవారం అవంతి పార్టీ కార్యాలయంలో అవంతి శ్రీనివాస్‌ని కలిసి గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా అవంతి అలివర్ రాయ్‌ని పార్టీలోకి ఆహ్వానించారు. భీమిలి నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా అవంతికి హామీ ఇచ్చారు.

వైజాగ్‌లో విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నమెంట్
బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఏసీఏ కార్యదర్శి
ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి

విశాలాంధ్ర - పీఎం పాలెం: విభిన్న ప్రతిభావంతుల స్టేట్ ఇంటర్ జోన్ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 29, 30 తేదీల్లో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు.

ఎన్నికల ప్రచారంలో స్వతంత్ర అభ్యర్థి నాగమణి

విశాలాంధ్ర - పద్మనాభం: గ్రామాల్లో ఇంటింటికి సోమవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్న నాగోతి నాగమణి విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిలో భాగంగా గత నాలుగు నెలలుగా నియోజకవర్గము అంతా అన్ని గ్రామాల్లోని వార్డుల్లో ప్రతి వీధికి తిరిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకంగా స్థానికరాలుగా నేను భీమిలి ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయుచున్నానని స్థానిక రాలునైన నన్ను గెలిపించి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

పదిలో 97.7% ఉత్తీర్ణత

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు తమ సత్తాను చాటి అత్యధిక ఉత్తీర్ణత శాతం పెంచడం జరిగిందని ఎంఈఓ తెలియజేశారు. పది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గాను బిఆర్ తాళ్లవలస ,రెడ్డిపల్లి, రేవిడి, పాండ్రంగి ,కేజీబీవీ, జడ్పీహెచ్ పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు. రేవిడి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.ఇందు 569 మార్కులతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో అన్నిట్లో అత్యధిక మార్కులు సాధించినట్లు తెలియజేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాల సంబంధించి స్ప్రింగ్ స్కూల్ విద్యార్థిని బి.భువనేశ్వరి 585 మార్కులతో అందరికంటే ఎక్కువ మార్కులు సాధించినట్లు తెలియజేశారు. మండలం మొత్తం ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలు కలిపి 97.7% ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు.

వంశీకృష్ణకి రజక సంఘం నేతలు మద్దతు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలోని 30, 36 వార్డులోని రజక సంఘం నేతలు ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కి రజక సేవ సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజక సేవా సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు వంశీకృష్ణకి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో తామంతా వంశీకృష్ణ శ్రీనివాస్‌కి మద్దతిస్తున్నామని నినాదాలు చేశారు. జై జనసేన అంటూ కూటమి అభ్యర్థికే మా ఓటు అని ఘంటాపదంగా తెలిపారు. కార్యక్రమంలో రజక సేవా సంఘం పెద్దలు, కార్యవర్గ సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ పద్మావతి తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 674 మంది హాజరుకాగా 634 మంది పాస్ అయ్యారని 95% ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మండలంలోని వెల్లంకి, రామవరం, శిర్లపాలెం గొట్టిపల్లి ,ఆనందపురం ,గిడిజాల, బోని, గండిగుండం, బోయపాలెం, తర్లువాడ, శొంఠ్యాం,కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఉత్తమ ఫలితాలు అందించారని మండల విద్యాశాఖ అధికారిని పద్మావతి తెలిపారు. మండలంలో గిడిజాల హై స్కూల్ కి చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని 570 మార్కులు, ద్వితీయ స్థానం గొట్టిపల్లి 568 మార్కులు, తృతీయ స్థానం ఆనందపురం హైస్కూల్ 561 మార్కులు విద్యార్థులు సాధించాలని మండలం మొత్తం గా చూసినట్లయితే 95 శాతం ఉత్తీర్ణత శాతం సాధించి విద్యార్థులు 10 పరీక్షల్లో ఫలితాలలో ప్రతిభ కనబరిచారని ఎంఈఓ తెలిపారు.

టికేయం నుంచి ఫార్చ్యూనర్ లీడర్

విశాలాంధ్ర- విశాఖ సిటీ: టొయోటా కిర్లోస్కర్ మోటర్ ఈరోజు ఫార్చ్యూనర్ యొక్క లీడర్ ఎడిషన్‌ను భారతదేశ మార్కెట్లో విడుదల చేసింది. దాని ప్రసిద్ధ ఫీచర్లపై ఆధారపడి, ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ అనేక యాడ్-ఆన్ ఫీచర్‌లతో విలక్షణమైన డిజైన్‌ను అందిస్తుంది.ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ దాని విభిన్నమైన స్టైల్ ఎలిమెంట్స్‌తో ప్రత్యేకంగా నిలుస్తుంది. శక్తివంతమైన ఫ్రంట్ మరియు రియర్ బంపర్ స్పాయిలర్‌ను కలిగి ఉన్న ఈ వాహనం, నాయకత్వపు నిజమైన సారాంశాన్ని ప్రతిబింబిస్తుంది. ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ ప్రధాన ఆకర్షణలలో డ్యూయల్-టోన్ ఎక్స్టీరియర్, 'నలుపు, తెలుపు మరియు క్లారిటీ ' ప్యాలెట్‌లో లభిస్తుంది. ఇంటీరియర్‌లో డ్యూయల్-టోన్ సీట్లు ఉన్నాయి, ఇవి సాటిలేని సౌలభ్యం మరియు చక్కదనాన్ని అందిస్తాయి, డ్రైవింగ్ అనుభవాన్ని కొత్త ఎత్తులకు పెంచుతాయి. ఖరీదైన అప్హోల్స్టరీ నుండి ఎర్గోనామిక్ డిజైన్ వరకు ప్రతి అంశమూ , ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ ప్రతి ప్రయాణాన్ని అద్భుతంగా చేస్తాయి.

దాని ఖచ్చితమైన స్టైలింగ్‌తో పాటు, ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ భద్రత మరియు కనెక్టివిటీని మెరుగుపరచడానికి రూపొందించబడిన అధునాతన ఫీచర్‌ల శ్రేణిని కలిగి ఉంది. ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ బ్లాక్ అల్లాయ్ వీల్స్‌తో వస్తుంది, ఇది ప్రతి మలుపులోనూ బోల్డ్ స్టేట్‌మెంట్‌ను ఇస్తుంది. ఫార్చ్యూనర్ లీడర్ ఎడిషన్ గురించి టొయోటా కిర్లోస్కర్ మోటర్, సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ వివరించారు.

పదిలో విజయదుందుభి మోగించిన భాష్యం విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని సరిపల్లి వద్ద గల భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు 10 ఫలితాల్లో విజయ దుందుభి మోగించారు. మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో కె శ్యామ్ రామ్ చరణ్ అనేది విద్యార్థి మొత్తం 600 మార్కులు గాను 590 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచాడు. మిగిలిన వారిలో 13 మంది 580 మార్కులకు పైగా, మరో 50 మంది 550 మార్కులకు పైగా మిగిలిన 91 మంది 500 పైగానే మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ కె రమేష్ కుమార్ తెలియజేశారు. అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ భాష్యం రామకృష్ణ, సీఈవో ఎం సత్యం, జోనల్ ఇన్చార్జ్ కె వెంకట్, ప్రిన్సిపాల్ కె రమేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. అద్భుత ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు సంపాదించి పెట్టిన అధ్యాపకులు, సిబ్బందిని డైరెక్టర్ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు అలాగే తల్లిదండ్రులు ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రణాళిక బద్ధంగా, క్రమశిక్షణ, స్వతంత్ర లక్షణాలతో విద్యాబోధన చేయడం ద్వారా గత కొన్నకొన్నేళ్లుగా భాష్యం విద్యా సంస్థలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయని ఆయన వెల్లడించారు.

బీసీలకు టికెట్ కేటాయించడంపై తాడి మనోహర్ హర్షం

విశాలాంధ్ర - ఆనందపురం: కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గం అభ్యర్థిగా లక్కరాజు రామారావు ను సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పార్టీ కోసం ఎంతో సేవ చేశారు రామారావుకు టికెట్ కేటాయించడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ తాడి మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలకండి
సీఎం రమేష్ సోదరుడు శ్రీనివాస్ నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: గత ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలకాలని ఎన్డీఏ కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరుడు శ్రీనివాస నాయుడు పెందుర్తి నియోజకవర్గం ప్రజలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 88 వ వార్డు సత్తివాని పాలెంలో కూటమి నాయకులు చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని, యువతకు ఉపాధి లేకుండా చేసిందని మండిపడ్డారు. సంక్షేమం పేరుతో పది రూపాయలు ఇచ్చి, పేదల నుండి వందల రూపాయలు లాగేసారని విమర్శించారు. వచ్చి ఎన్నికల్లో ఎన్డీఏ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కమలం, గాజు గ్లాస్ గుర్తులను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీగా సీఎం రమేష్ నాయుడు, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేష్ బాబు నిబద్ధతతో పనిచేసి అనకాపల్లి ప్రాంతం అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. అంతకుముందు గ్రామాలకు వచ్చిన ఎన్డీఏ కూటమి నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామనాయుడు మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అభినందన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన పెదగంట్యాడ మండలం విద్యార్థులనను మండల విద్యాధికారులు అభినందించారు. "కృషితోనాస్తి దుర్భిక్షమ్" బాగా కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాదించవచ్చని పెదగంట్యాడ మండలం విద్యార్థులు రుజువు చేసారని మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, రమణాజీ అన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని రక్షించండి

విశాలాంధ్ర - మధురవాడ: జగన్ విధ్వంసకరపాలన నుండి రాష్ట్రాన్ని రక్షించేందుకు అపార అనుభవం గల చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తన ప్రచార యాత్రని జీవీఎంసీ ఏడవ వార్డు చంద్రంపాలెంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగన్ అమలు చేసిన ప్రతి పథకంలో ప్రజలను దోచుకునేలా పెద్ద పథకమే వేశారని, మద్యపాన నిషేధంలో అది అందరికీ అర్థమవుతుందన్నారు. కూల్చివేతతో ప్రారంభమైన ఆయన విధ్వంసకర పాలన మన రాష్ట్రానికి రాజధాని లేని దుస్థితిలో పట్టిందన్నారు. ఈ దశలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార యాత్ర అక్కడనుండి ఎస్టీవోస్ కాలనీ, పాత మధురవాడ ,బాంబే కాలనీ కళా నగర్ పిలక వానిపాలెం తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు అధ్యక్షులు పిల్లా వెంకట్రావు, టిడిపి కార్యకర్తలతో పాటు కార్యదర్శులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వైవీ చేతుల మీదుగా బీ-ఫాం అందుకున్న "వాసుపల్లి"

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దక్షిణ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్ కుమార్ బీఫారం అందుకున్నారు. రాజ్యసభ సభ్యులు, ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆయన సోమవారం సాయంత్రం బీ-ఫాం అందుకుని అనంతరం మాట్లాడారు. ఏపీ సీఎం జగన్ ఆశీస్సులు, దక్షిణ ప్రజలు, వైసిపి శ్రేణులు దీవెనలతో తాను మళ్లీ ఎమ్మెల్యేగా బరిలోకి దిగానని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ అభ్యర్థించారు.

దివిస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: ప్రాణకోటి మనగుడకు ఆధారం భూమి, పుడమని కలుషితం చేసుకుంటే మన భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని ఇప్పటికైనా మేల్కొని పుడమి తల్లిని కాపాడుకోవాలని దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎల్వి రమణ పిలుపునిచ్చారు. సోమవారం దివిస్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, లోకల్ ప్రజలు అన్నవరం గ్రామం దివిస్ జెట్టి దగ్గర బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీడీ మేనేజర్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ 22/4/24న వరల్డ్ ఎర్త్ రోజు సందర్భంగా బీట్ ప్లాస్టిక్ నినాదమును పురస్కరించుకొని సేవ్ ఎర్త్ కొరకు ప్లాస్టిక్ పొల్యూషన్ స్లోగన్‌గా ర్యాలీ చేసిన అనంతరం బీచ్ లో ఉండే వ్యర్థాలను క్లీన్ చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్‌ను వాడవద్దు అని కోరుతూ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, సేఫ్టీ ఆఫీసర్ ఐఎల్‌బి ప్రసాద్, సిఎస్ఆర్ ప్రతినిధులు ఏ.శ్రీనివాస్, పి.శేఖర్ బాబు, దివిస్ ఉద్యోగులు పాల్గొన్నారు.